# జెలసీ

నేనూ చలపతిరావూ చాలా స్నేహితులం. బి.ఎ. చదువుతోవుండగా ఒక సాయంత్రం హఠాత్తుగా అతనికి వితంతువులమీద ప్రేమ కలిగి, వాళ్ళ కష్టాలమీద కరుణ పుట్టింది. వితంతువును తప్ప పెళ్ళి చేసికోనని పట్టుపట్టాడు. మేనమామ కూతుర్నిస్తామని వస్తే "ముందు వితంతువును కానియ్యి" అని చీవాట్లు తిన్నాడు.

యల్. టి. చదువుతో, మళ్ళీ మేమిద్దరమూ, ఒక గదిలోనే వున్నాము. ఆ గదివున్న ఇంటి ఆయన కుమారస్వామి. ఆయన భార్య నవ్వుతో మాకు చదువు సాగక కాలేజీలో ప్రతిరోజా చీవాట్లు. ఆమె దర్శనం యెన్నడో అయేది. ఆ నాడింక ఆమె తప్పయింక దేనికీ కళ్ళు అంధాలయేవి. చేసుకుంటే అల్లాంటి పిల్లని తప్ప చేసుకోనన్నాడు చలపతిరావు. అటువంటి పిల్లకావాలి, ఆమె వితంతువు ఐవుండాలి, వాడికి పెళ్ళి కావాలంటే. అది చాలా అసంభవంగా తోచింది. ఆ కుమారస్వామిని హత్యచేస్తే తప్ప. కాని ఆమె తనని వలిచి వొళ్ళో వాలాలని మూడో షరతు పెట్టాడు చలపతి. భర్తహంతకుణ్ని మోహించినట్లు హిందూ దేశ చరిత్రలో నిదర్శనాలు కనపబడ్డాయి కాని అవేమీ ఆంధ్రదేశానికి చెందినట్లు లేవు. అందులో ఆ పిల్ల వీడివంక కన్నెత్తి చూడనన్నా చూడటంలేదు.

నాలుగేళ్ళ అయింది. కుమారస్వామి భార్యని చలపతిరావు పెళ్ళి చేసుకున్నాడు. అసంభవ మనుకున్న మూడు షరతులూ నెరవేరాయని నాకు రాశాడు చలపతిరావు. కుమారస్వామి పాత భార్యనూ, చలపతిరావు కొత్త భార్యా ఐన రాజమ్మ చక్కదనాన్ని తలుచుకుని, పొయ్యిదగ్గర చారు తిరగమోత పెట్టుతున్న నా భార్య వంకరదనాన్ని చూసుకుని, ఒక వారం బాధపడ్డాను. తరువాత మరిచిపోయాను.

మూడేళ్ళయింది. బెజవాడ వెళ్ళటం తటస్థించింది నాకు. మూడు రోజులు చలపతిరావు యింట్లోనే బసచేసి, ఆనాటి రాత్రి మెయిలికి పోతానని శలవు తీసుకుని బయలుదేరాను. మెయిలు తప్పింది. స్టేషనులో పడుకుందామంటే చలి, తిరిగివచ్చి, ఆ దంపతుల్ని లేపడమెందుకని వాళ్ళ యింటి ముందున్న చిన్న గేటుదూకి, వరండాలో నా మామూలు మంచము వాల్చుకుని, రైలు సంచిలో దుప్పటితీసి కప్పుకుని, సంచి తలకింద బెట్టుకుని పడుకున్నాను. లోపల గదిలోనించి కంఠాలు వినబడుతున్నాయి. సంభాషణ అంత నిష్ఠూరంగా జరుగుతుందని తెలిసివుంటే ముందే నేనున్న సంగతి వాళ్ళకి తెలిసేట్టు చేసివుందును. కొంతసేపు విన్న తరవాత నేను వున్న సంగతి తెలియ చెయ్యడం దుష్కరమయింది. పోదామంటే చలి.

"మరి అప్పుడు నన్ను బైటి గదిలో చూసేదానివి కదా"-

"ఎప్పుడు?"

"అదే (కష్టంగా) ఆ కుమారస్వామితో వుండేప్పుడు- అప్పుడు..... నువ్వు నన్ను చూశావుకదా, నామీద యిష్టం కలగలేదూ?''

"ఎందుకు కలుగుతుంది? మీరెవరో!''

"అంతేనా! మరి యిప్పుడో?''

"అడుగుతారా?''

"అప్పుడు ప్రేమరానిది యిపుడు మాత్రం వొస్తుందా యేమిటి?''

"ప్రేమించంది, మిమ్మల్నెందుకు పెళ్ళి చేసుకుంటాను?''

"అతను.... ఆ కుమారస్వామి - బతికివున్నపుడే, నిన్ను నాతో రమ్మంటే వచ్చేదానివా?''

"తప్పుకాదూ?''

"మరి యింక నామీద ప్రేమ యేమిటి?''

జవాబు లేదు.

"పోనీ, అతన్నెక్కువ ప్రేమించావా, నన్నా!''

"మిమ్మల్నే సందేహమా?''

"అతను నా అంత ప్రేమగా వుండేవాడా, నీమీద?''

"ఆఁ.''

"కాని అప్పుడప్పుడు కోప్పడేవాడే?''

"ఆ కోపం యేముందిలేండి!- హాస్యానికి.''

(నొచ్చుకున్న కంఠంలో) "ఐతే అతను బతికి వుంటేనే బాగుండననుకుంటున్నావా?''

"ఛా.''

"ఏం?''

"అప్పుడు మీరెట్లా తెలిసేవారు?''

"నేను తెలియక పోతేనేం? అతనితో బాగానే వుందిగా?''

"కాని, మీ ప్రేమో?''

"అంటే ప్రేమలు నీకు మారుతో వుండాలన్న మాట. నేను చస్తే బాగుంటుందా యిప్పుడు?''

"పోండీ, మరీని,''

"చెప్పు.''

మాటాడలేదు ఆమె.

"చెప్పమంటే. నేను చావాలనే వుంది. అందుకనే మాటాడవు-చెప్పవేం?''

"పొండి. ఆయనతో యెట్లా వుంటే మీకేమండీ? ప్రతిరాత్రి ఆయన ప్రస్తావన తెచ్చి చంపుతారు. ఆయనేమన్నా దెయ్యమై పట్టాడాయేమిటి మిమ్మల్ని? ఇంత గాఢంగా ప్రేమిస్తున్నానే చాలదూ?"

మాటలు లేవు. ఏడుస్తో వూపిరి పీలుస్తున్న చప్పుడు.

"చూడు. ఇంకెప్పుడు ఆ సంగతి యెత్తనుగాని ఇది వొక్కటి చెప్పు చాలు. నిజం చెప్పాలి. మొదటిరోజు శోభనం గదిలో మొదట అతనేం చేశాడు?"

"ఏమండీ? ఏం చేస్తారేం? మీకు తెలియదా? మీరేం చేశారు?"

"నేనా? నా మొహం, నాకా అదృష్టం కూడాను? చెప్పుమరి?"

"ఎందుకండి అదంతా యిప్పుడు? ఎప్పుడో మరిచిపోయినాను"

"మరిచిపోలేదు. జ్ఞాపకం తెచ్చుకో. నిజం చెప్పు, అబద్ధం చెప్పావా? (గొంతు మార్చి) ఇదొక్కటి చెప్పు. నిద్రపోతాను. ఏం చేశాడు? నువ్వు యిష్టపడ్డావా? చెప్పుదూ? మీ ఇంట్లోనేగా - కుంచవరంలో ఆ యింటి పడమర గదిలో - జ్ఞాపకం వస్తోంది కాదూ?"

"ఏం లేదు. ఏముంది? నే సిగ్గుపడుతూ నుంచున్నాను."

"అప్పటికి నీకు తెలుసా?"

"ఏమిటీ?"

"అబ్బా, నన్ను చంపకు, ఇదే-ఇదంతా."

"నిజం నాకేమీ తెలీదు, అప్పటికి."

"ఆ, తెలీకండా వుంటుందా యేం?"

"ఎట్లా తెలుస్తుంది? నిజం."

"అప్పుడే నన్నమాట-పాపం, నిన్ను ఏం తెలీనిదాన్ని-వొంటరిగా"

(నువ్వు............)

"ఎందుకు నవ్వుతావు?"

"ఏం లేదు."

"ఏం లేదూ? చెపుతావా చెప్పవా?"

"ఏం లేదండీ? వొంటరిగా-ఏమిటి? మరి భార్య నైనాక-"

"అవును, ఏం చేశాడు?"

"అబ్బా? నాకు తెలీదు, నిద్ర వొస్తోంది?"

"చెప్పాలి, చెప్పి తీరాలి, నిన్ను నిద్రపోనీను యీ రాత్రి, చెప్పిందాకా?"

"ఆయన లేచివొచ్చి, చెయ్యి పట్టుకుని-"

"వొద్దు-వొద్దు....ఆ కొత్తదనం, ఆ సిగ్గు అదంతా హాయిగా వాడనుభవించాడు - అంతా పాతై నీ కంతా తెలిసి మామూలై పోయిన తరవాత-యిప్పుడు-వాడు అన్నీ తాకి వొదిలేసి మిగిలినవి, ఇదే నా బతుకా? ఛీ, ఛీ. వెధవని-"

"నేను ప్రేమిస్తున్నానుగా?"

"అవునులే, ప్రేమించడమూ, అవీ, అన్నీ, అతను నేర్పాడు నీకు. ఆ చూపులు, ఆ నవ్వు, అన్నీ అతని కోసం నేర్చుకుని, నామీద చూపుతున్నావు. నేను ముద్దు పెట్టుకుంటే, అతను పెట్టుకున్న ముద్దులతో పోల్చుకుంటావు. అవి మొదటివి. కొత్తవి. అవే బాగుండి ఉంటాయి నీకు. అవునా?"

"ఏం చేయమంటారు నన్ను?"

"ఒప్పుకున్నావుగదా నిజమని! ఆహా! నీ ప్రేమంతా అతనిదే. అతన్ని తలచుకుంటో నా మీద చూపుతావు. చీకట్లో అతనినే అనుకుని తృప్తిపడతావు. అవునా?"

"ఛీ?"

"అవునులే నాకు తెలుసు."

"కాదండీ"

"నోరుముయ్యి మాట్లాడకు. కొందరు కులటలకి బతికివున్న పరాయి వాళ్ళమీద ప్రేమ. నీకు చచ్చిన పరాయి వాడిమీద."

"నిజంగా ఆయన జ్ఞాపకమే లేరండీ. మీరు తప్ప యీ హృదయంలో యెవరూ లేదు."

"నిజమా? నిజమా? ఎట్లానమ్మను? మూడేళ్ళలోనే మరచిపోతావా? అబద్ధం ? అయితే మరి నేను చచ్చినా అంతే?"

"ఛా."

"ఛా, ఏమిటి? మరి అతన్ని కూడా ప్రేమించావా? చచ్చిన ఆరోనెలలో నన్ను పెళ్ళాడావా? అంతేగా? నేను చస్తే మళ్ళీ-"

"ఊరుకోండీ."

"మాట్లాడవేం?"

"నాకు తెలీదు. నిద్ర వొస్తోంది, పడుకోనీండి."

"అది ఒకటి చెప్పు ముందు-నిజంగా నామీద ప్రేమేనా?"

"మళ్ళీ మొదలా?"

"వాడు-ఆ కుమారస్వామి."

"పడుకోండీ-ఏమిటండీ, ప్రతి రాత్రీ యీ గోల? మీకేమన్నా మతిచెడిందా? ఆయన ధర్మమా అంటో మీ స్నేహితుడు ఈ మూడు రోజులు వున్నాడు. ఆయన ఉన్నాడని ఊరుకున్నారు. బతికిపోయినాను. రైలుకు వెళ్ళాడో లేదో మొదలుపెట్టారు."

"అతనింకా ఉండాలనే ఉందన్నమాట."

"ఆ!"

"అప్పుడే కన్నేశావన్నమాట."

"ఛీ, నోరు ముయ్యండీ"

"అవును, నేను బతికివుండగానే తరవాత భర్తను సిద్ధం చేసుకుంటున్నావన్నమాట."

"మీకు మతిపోయింది."

"మరి కుమారస్వామి బతికి వుండగానే, నన్ను చూసుకోలా? అట్లానే!"

"నేను మాటాడను."

"ఎందుకు మాటాడుతావు? నిజం చెప్పు-వాడిమీద కన్ను వెయ్యాలా? నాకు తెలిసిందిలే. ఎన్నడూ లేనిది, మళ్ళీ మంగళవారం వస్తానన్నాడు. ఓసి దొంగ-ఓసి-ముండా."

"ఛీ, ఊరుకొండి-మీకు పిచ్చి మితిమీరిపోతోంది మరిన్నీ."

"అవును, పిచ్చే - నీకు హృదయం లేదు. నిన్ను చంపినా పాపం లేదు. నీవంటి వాళ్ళు బతికి వుండకూడదసలు - రాక్షసివి. మొగుడు బతికి వుండగానే మొగుణ్ని చూసుకోడమా? రెండోసారి. ఇంక యేముంది? నన్ను చంపేట్టున్నావే? మాటాడవేం? పాపం. ఆ నిర్భాగ్యుణ్ని. ఆ అమాయకుణ్ని కుమారస్వామిని చంపావా, నా కోసం? ఆ చంపే వుంటావు. ఎంత ఘాతుకరాలివే!"

ఏడుస్తోంది ఆమె.

"ప్రతి మొగాడితోను-యిట్టా నన్ను కట్టి చంపకపోతే పొమ్మనరాదూ, పోతాను!"

"పోవాలనే చూస్తున్నావూ? వాడిదగ్గరకేనా? పో, పో, పో, ముందు"

రెండు దెబ్బల చప్పుడు, ఏడుపు. గడియ తీస్తున్నారు. అమాంతం పక్కమీద వాణ్ని లేచి చిన్నగేటు దూకి చిన్న వీధుల్లో పడ్డాను. ఒక్కపరుగున రైలుస్టేషను చేరుకున్నాను.

ఎంత నాగరికత, దయ, రెస్పెక్టు గలిగిన మనుష్యులూ, భార్యల దగ్గిర ఇట్లా అవుతారు గావును. చలపతిరావు అంత "నైస్‌మాన్" అట్లా మాట్లాడాడే! నిష్కారణంగా ఈ గదులలో ఎంతెంత ఘోరకృత్యాలు జరుగుతాయో! కోటూ తలగుడ్డ ఇంటికి రాగానే తీసేసినట్టే మానర్సు, సెన్సు, రెస్పెక్టు, అన్నీ తీసి చిలక్కొయ్యకి తగిలిస్తారు. భార్యేగా! పగలంతా స్టేజిమీదవలెనే వేషంలో ఉంటారు. ఆ తెరవెనక నిజస్వరూపంతో తయారవుతారు, ఈ పెద్ద మనుష్యులందరూ. ఏ కోపమో, జెలసీ కామమూ, ఇట్లాంటివి పట్టుకొని ఊపేప్పటికి మనుష్యుల మనుకొని ప్రవర్తించే వారందరూ, కుక్కలూ, కోతులూ, పెద్దపులులూ, ఎలుగుబంట్లుగా మారతారు-ముఖ్యంగా తమ మీద ఆధారపడి, ఇతరమైన దిక్కులేని భార్యలముందూ, పిల్లలముందూ. ఆ మాట అంటే పట్టరాని కోపం.

◆ ◆ ◆

*ప్రచురణ : (చలంగారి కలం, స్టేషనుపంపు), ఎమెస్కో ప్రచురణ, జూన్ 1971*